# నిరీక్షణ



**-దౌలత్ బేగం**

కలెక్టరుగారి ఇంట్లో నించి పోలీసుబాండు శబ్దం ఎప్పుడు మధురంగా వినిపిస్తోంది. ఊళ్లో ఉన్న కార్లన్నీ కలెక్టరుగారి బంగళా వైపు పరుగులు తీస్తున్నాయి. ఆ ఇంట్లో పెళ్లిబాజాలు మోగగానే జానకమ్మ మనస్సు పురివిప్పిన నెమలిలా నాట్యమాడింది. జానకమ్మ సంతోషం ఈ రోజు వర్ణనాతీతం. తను కనక పోయినా పసిగుడ్డుగా ఉన్నప్పటినుంచి పెంచి పెద్దచేసి తన సర్వస్వం ధారపోసి చదివించిన సీను పెళ్లి అంటే మరి సంతోషం కాదా? అందులోనూ ఆ ఊరి కలెక్టరుగారి ఏకైక పుత్రిక సుశీలతో పెళ్లి. రెండు గదుల తాటాకు కొంపలో మాసికలచీర కట్టుకొన్న జానకి సుతిమెత్తని మనస్సు దూది పింజలా తేలిగ్గా తేలిపోతూంది. ఆమె కా సమయంలో సీను చేసిన అన్యాయంగాని, అలక్ష్యంగాని గుర్తు రావటం లేదు. సీను జానకమ్మ చేతుల్లో పెరిగి జానకమ్మ పెట్టిన డబ్బుతో బి. ఎ. పాసయి చివరికి ఉద్యోగం అయాక రెక్కలు వచ్చిన పక్షిలా ఎగిరిపోయాడు! ఎగిరి వెళ్లి తిన్నగా కన్నతల్లి ఒడిలో వాలాడు. జానకమ్మ చూసిపెట్టిన సంబంధం ఇష్టంలేదని ఆమెతో చెప్పా పెట్టకుండా జానకమ్మను ఒంటరిగా వదిలివేసి వెళ్లిపోయాడు.

జానకమ్మ రాత్రి అంతా సరిగా నిద్ర పోలేదు. ఏ నిమిషానన్నా సీను వచ్చి, ''పెద్దమ్మా! నీవు రానిదే నా పెళ్లి జరగదు. పద, నాతో'' అంటాడేమోనని ఎదురుచూస్తూ ఉండి పోయింది. 'పాపం, పిచ్చినాన్న! సిగ్గుపడి రాలేకపోయాడేమో! ఎవరితోనైనా కబురంపి ఉంటాడు. ఈపాటికి ఎవరైనా బయలుదేరి ఉంటారు' అనుకొంటూ పాచి ఊడ్చి, అంట్లు తోమి లోపల కూర్చుంది.

పోపుల డబ్బాలో ఉన్న చిల్లర తీసింది. రోజూ ఐదు పైసల టీ పొట్లం తెప్పించుకొని, పది పైసల పాలు పోయించుకొని టీ చేసుకొనేది.

కాని జానకమ్మకు ఈ రోజు పదిహేను పైసలు ఖర్చు చేయాలనిపించలేదు. మొత్తం చిల్లర ముప్పయిరెండు పైసలే ఉన్నాయి. ఒకవేళ పెళ్లికి వెళ్లవలసి వస్తే కనీసం రిక్షా ఖర్చులకైనా వస్తాయనుకొంది. డబ్బులు జాగ్రత్తగా కొంగుకు ముడి వేసింది.

ట్రంకుపెట్టె తెరిచి ముదురాకు పచ్చ దిండిగల్లు చీర తీసి దండెం మీద పడవేసింది, ఒకవేళ ఎవరైనా పిలవటానికి వస్తే త్వరగా కట్టుకొని బయలుదేరవచ్చని. చద్ది అన్నం ఉంటే మజ్జిగ పోసుకొని ఉల్లిపాయ నంజుకొని తినేసింది. ఇక ఆ పూట టీ తాగాలని పించలేదు. కడుపులో ఆ చద్దిఅన్నం ఎంత చల్లగా ఉందో ఆమె మనస్సులో కొడుకు పెళ్లి అనే సంతోషం అంత హాయిగా ఉంది. ఇన్నేళ్లకు తనూ అత్తగారిహోదా పొందబోతూంది. ఆ ప్రమోదవేళ చద్దిఅన్నం ఆమెకు పరమాన్నంలా ఉంది. చెల్లెమ్మా, మరిదిగారూ తనతో సీను పెళ్లిని గురించి విరోధం తెచ్చుకున్నారు. పిచ్చిసన్యాసులు! వాడి కిష్టమైన పిల్లను చేసుకోవద్దని నేను మాత్రం ఎలా అంటాను? అయినా ఎవరికి ఏది రాసిఉందో అదే అవుతుంది. అదిగో! ఎవరో కార్లో వస్తున్నారు. నా కోసమేనేమో! ఎవ రెన్ని చెప్పినా నా బాబు, ఈ చేతులతో పెంచిన నా సీను నేను లేకుండా తాళి కట్టలేడు. జానకమ్మ గబగబా లేచి వీథిలోకి వెళ్లబోయేసరికి గడప నుదుటికి తగిలి బొప్పి కట్టింది. కారు ఇంటి ముందునుంచి దాటుకొనివెళ్లిపోతుంటే, 'ఇల్లు తెలీలేదేమో!' అనుకొంది, ఆమె పెంచిన ప్రేమ హృదయం.

దారిన ఎవరో పోతూంటే అడిగింది;

"బాబూ, టైమెంతయింది?"

"పదిన్నర."

'ఆఁ. . . అప్పుడే పదిన్నరయిందీ! సీను పెళ్లి ముహూర్తం పదింటికేగా! అయితే, ఈపాటికి సూత్రధారణ అయిపోయిందన్నమాట. కాదు. . . కాదు...అలా ఎప్పటికీజరగదు. పెద్దమ్మ పక్కన లేకుండా వాడే పనీ చేయలేడు. ఎవరో ఈ ప్రబుద్ధుడు తప్పుటైము చెప్పిఉంటాడు. అడ్డమైన గడియారాలన్నీ వచ్చాయి. ఒకటీ సరిగా టైము చూపించదు. రాత్రిఆగిపోయి ఉంటుంది. పాపం, అతనెవరో దాన్ని సరిచేసుకొని ఉండడు. ఏందుకైనా మంచిది శుభలేఖ, నా సీనుగాడు పంపిన శుభలేఖ చూస్తే ముహూర్తం ఎన్నింటికో తెలిసిపోతుంది' అనుకొంటూ లోనికి వచ్చి, తన బట్టల పెట్టె తెరిచి పెళ్లి పత్రిక తీసి చూసింది. అందులోనూ పదిన్నరే ఉంది. 'ఒకవేళఅచ్చుతప్పేమో! పన్నెండున్నరకి బదులు పదని పడిం దేమో! అదిగో, ఎవరో సైకిల్మీద వస్తున్నారు! నా కోసమే నేమో?' చేతిలో పత్రికతో వీథిలోకి వచ్చింది.

ఆ సైకిలూ జానకమ్మ ఇల్లు దాటుకుంటూ ముందుకు సాగిపోయింది. పెళ్లివారింట్లోనించి బాండు శబ్దం వినిపిస్తూనే ఉంది. ఉన్నట్లుండి బాజాలు చాలా జోరుగా మోగాయి. "సీతమ్మ పెళ్లికూతురాయెనే" అని పాడాయి. జానకమ్మ మనస్సు నిలవటం లేదు. 'ఎవరూ రాలేదు, తనని పిలవటానికని. ఎందుకనో? ఇల్లు కనుక్కోలేక పోయారేమో? సాయంత్రానికైనా తప్పక వస్తాడు. ఒంటరిగా ఎందుకు, ఒకేసారి పెళ్లికూతురితో వచ్చి పెద్దమ్మ ఆశీర్వాదం పొంద వచ్చని అనుకొని ఉంటాడు. పిచ్చి నాగన్న! బి. ఎ. చదివాడు. కానీ బొత్తిగా లోకజ్ఞానం లేదు. పెళ్లి అయిన రెండో ఏడాదే భర్తృవియోగంతో బాధపడుతున్న తన చేతుల్లో చంటివాణ్ణి ఉంచి, "అక్కా! వీడు నీ వాడే అనుకొని పెంచి పెద్దవాణ్ణి చేసి, ఓ ఇంటివాణ్ణి చేయాలి" అని ఆ రోజు చెల్లెమ్మ తన కన్నబిడ్డను నా కోసం, నా సుఖం కోసం దూరం చేసుకొంది. అలా ఎవరైనా చేస్తారా? అది పిచ్చితల్లి! దానికేం తెలీదు. పెళ్లిలో ఒంటరిగా ఎంత అవస్థ పడుతూందో! తను చూసిపెట్టిన సంబంధం ఇష్టంలేకపోతే, పోనీ ఒకసారి వచ్చి పెద్దదాన్ని ఉన్నానని అయినా చెప్పాలని తోచి ఉండదు. అయినా వాడే తప్పు. వాడు అంత ప్రేమగా ఓ శుభలేఖకూడా పంపాడు. ఉత్తరం రాయటానికి తీరిక ఉండి ఉండదు. నేనే వెళ్లి వాణ్ణి దీవించి ఉండవలసింది. నా కోసం ఎంత ఎదురు చూశాడో! పెంచి పెద్దచేసిన కొడుకు పెళ్లి కళ్లారా చూసే భాగ్యం నాకు లేక పోయింది. అయినా నన్ను ఒకరు పిలవాలా? నేను వాణ్ణి పెంచిన అమ్మను కాదా? కన్నప్రేమ కంటె పెంచిన ప్రేమ ఎక్కువంటారే మరి! తన ప్రేమంతా ఏమైంది? ఎంత పొరపాటు! తను వెళ్లి ఉండవలసింది.

'అయిపోయాక, సమయం దాటి పోయాక చింతించి ఏం లాభం? వాడు ఏ వేళప్పుడు వస్తాడో! ఓ కొబ్బరికాయ, పసుపు, కుంకుమ తెచ్చి ఉంచితే మంచిది. అమ్మాయి చేతిలో పెట్టి ఆశీర్వదించవచ్చు.' అలాగ అనుకొంటూ కొంగునున్న డబ్బులు తీసి మరోసారి లెక్క పెట్టుకొంది. ముప్పయిరెండు పైసలూ తీసుకొని ఆ పక్కనే ఉన్న కోమటి కొట్టుకి వెళ్లి, "సెట్టీ! ఓ కొబ్బరికాయ, పసుపుకొమ్ము, కాస్త కుంకుమ పొట్లం కట్టివ్వు. . ." అంది ఆ పైసలు అతనికి అందించి. అతను డబ్బులు లెక్కపెట్టుకొని జానకమ్మ వంక అదోలా చూశాడు. "త్వరగా ఇవ్వు, బాబూ... అబ్బాయి వచ్చేస్తాడేమో!" అంది ఆలస్యం భరించలేనట్లు.

"చూడమ్మా, పంతులమ్మా! ఈ డబ్బులకి కొబ్బరికాయ వస్తుందా?" అన్నాడు.


"బాబ్బాబూ! ఓ కొబ్బరికాయ ఇద్దూ. నీ కూతురికి గౌను కుట్టి పెడతానే ఎప్పుడన్నా. నా దగ్గర ప్రస్తుతం అన్నే డబ్బు లున్నాయి. నా పెన్షన్ రావటానికి ఇంకా పది రోజు లుంది. మిషన్మీద ఏమంత ఆదాయం లేదు" అంది ప్రాధేయ పూర్వకంగా.

"ఇదిగో, పంతులమ్మా! కొబ్బరి కాయ ఇస్తాగానీ పిల్లదాని గౌనులూ, మా ఇంటిదాని రవికెలూ కుట్టి పెట్టాలి" అన్నాడు బేరం కుదిరినట్లు.

"అలాగే, బాబూ! తప్పక కుట్టి ఇస్తాను."

కొట్టువాడు అందించిన కొబ్బరి కాయ, పసుపుకొమ్ములు — అవి తీసు కొని గబగబా ఇల్లు చేరింది. ఆమెకు ఏటూ తోచటం లేదు. కాలు నిలవటం లేదు. ఎండ తీవ్రంగా ఉంది. జానకమ్మ ఇంటిముందున్న పెద్ద వేప చెట్టునీడన ఆవులు, గేదెలు విశ్రాంతి తీసుకొంటున్నాయి. ఎవరో కూలివాళ్లు ఆ చెట్టుకింద కూర్చుని వాళ్లు తెచ్చుకున్న మూటలు విప్పుకొని తింటున్నారు. జానకమ్మకు వాళ్లను చూశాక ఆ రోజు పొయ్యి రాజేయలేదనే సంగతి గుర్తు వచ్చింది. ఆమె చూపులన్నీ ఆ వీథివైపే ఉన్నాయి. అస్తమానం వీథిలోకి వెళ్లివస్తుంది. వచ్చి మంచం మీద పడుకొంటుంది. ఆ రోజు వంట చేసుకోవాలనే ధ్యాసకూడా లే దామెకు. కొడుకు పెళ్లిసంబరంతో కడుపు నిండిపోయిం దామెకు. అంత లోకే పక్కింటి సుందరమ్మ వచ్చింది. "ఏమండీ, జానకమ్మగారూ! ఊళ్లో అబ్బాయి పెళ్లి అవుతూంటే మీరు ఇంట్లోనే ఉన్నారు?" అంది గడపలో చతికిలపడుతూ. జానకమ్మ ఆమెను చూసి లేచి కూర్చుంది. "వచ్చారా, పిన్నిగారూ! మీరు ఇక్కడే ఉండండి. అబ్బాయి, అమ్మాయిలు వస్తారు. చూద్దురుగాని" అంది ఆమె దగ్గరగా వచ్చి కూర్చుంటూ.

**తను కనకపోయినా కని గుడ్డుగా ఉన్నప్పటి నుంచి పెంచి పెద్దచేసి తన సర్వస్వం ధారపోసి చదివించిన సీను పెళ్ళి అంటే మరి సంతోషం కాదా? అందులోనూ ఆ ఊరి కలెక్టరుగారి ఏకైక పుత్రిక సుశీలతో పెళ్ళి. రెండు గదుల కొటాకు కొంపలో ముతకచీర కట్టుకొన్న జానకి మతిమెత్తని మనస్సు దూదిపింజలా తేలిగ్గా తేలిపోతూంది. ఆమె కా సమయంలో సీను చేసిన అన్యాయం కానీ, అలక్ష్యం కానీ గుర్తు రావడంలేదు.**






చిత్రం— ముదగపాటి శివరామకృష్ణ (హైదరాబాదు)

"వస్తామని కబురంపారా?" అంది సుందరమ్మ.

"పిన్నిగారూ! వాడు నాకు కబురంపాలా? వాడి సంగతి నాకు తెలీదూ? తప్పక వస్తాడండీ! మీరు చూస్తూ ఉండండి, కారేసుకొని రాడూ! ఎండగా ఉందని బయలుదేరి ఉండడు" అంది తనలో తనే నవ్వుకొంటూ.

సుందరమ్మ నవదంపతుల రాక కోసం ఎదురుచూసి చూసి సాయంత్రం అయిందని వెళ్ళిపోయింది. సూర్యుడు లోకంమీదికి విసిరిన తన కిరణాల బాణాలను ఏరి పేర్చుకొంటున్నాడు. తెల్లని ఆకాశంలో పక్షులు గుంపులు గుంపులుగా ఎగురుతూ తమ తమ స్థావరాలు చేరుకొంటున్నాయి. జానకమ్మ మనస్సు నిర్మలంగా, ఆకాశమంత విశాలంగా ఉంది. ఆ సంధ్యా సమయాన్ని చూస్తూ అలాగే గడపలో ఎంతసేపు నిలబడిందో ఆమెకే తెలీ లేదు. వీథిదీపాలు నక్షత్రాల తోరణాల్లా మెరిసిపోతున్నాయి. వీధిలో వెలుగు ఆవరించింది. జానకమ్మ ఇంట్లో చీకటి! తుళ్ళిపడి లోనికి వెళ్ళి హరికెన్ లాంతరు వెలిగించింది. ఆ దీపం కాంతిలో పెరట్లో ఉన్న కనకాంబరాలు కోసి కట్టిపెట్టిన మాల వింతగా మెరుస్తూంది. అంతలోనే ఓ పదేళ్ల పిల్ల పరిగెత్తుతూ వచ్చి, "టీచర్ ఓ మూరా కనకాంబరా లివ్వండి . . . మా అమ్మ తెమ్మంది" అంది.

"ఈ రోజు మా సీనూ, వాడి భార్యా వస్తున్నారమ్మా! పూలు మా క్కావాలి" అంది జానకమ్మ, కట్టిపెట్టిన మాలను మరోసారి చూసుకొంటూ. చిలుంపట్టి ఉన్న ఓ పాత ఇత్తడిపళ్లెం తీసి, చింతపండు పెట్టి తెల్లగా మెరిసిపోయేటట్లు తోమింది. ఆ పళ్ళెం శుభ్రంగా తుడిచి పూలు, కొబ్బరికాయ, పసుపుకుంకుమ అన్నీ అమర్చింది. ఓ చెంబుడు నీళ్ళలో పసుపూ, సున్నం కలిపి చిన్న చిన్న బొగ్గుముక్కలు వేసి, తలుపు వెనకాల పెట్టింది, నవ దంపతులకి దిష్టి తీయటానికోసమని.

మళ్లీ వీథిలోకి వెళ్ళి నిలబడింది. పోలీసు బాండుమేళం శబ్దం మళ్లీ వినిపిస్తూంది. ఊరేగింపు బయలుదేరి నట్లుంది. దూరంనుంచి గాసులైట్ల కాంతి కనిపిస్తూంది. జానకమ్మ కళ్లు ఆనందంతో గాసులైట్లలా వెలిగి పోయాయి. సంతోషంతో, ఆనందంతో ఉక్కిరిబిక్కిరై పోయింది. 'నా సీను బాండుమేళంతో వస్తున్నాడు! నే నంటే వాడి కెంత ప్రేమ! నా బాబు కలెక్టరు అల్లుడై కార్లో వస్తున్నాడు! నేను పెంచినవా డింతవా డయ్యాడు. ఇక నా కేం కావాలి? తనకు ఇంతకంటె మించిన ఆనందం ఏముంటుంది?' లోపలికి వెళ్ళి పళ్లెం, చెంబూ రెండూ ఉన్న చోటునుంచి తీసి మరోచోట పెట్టింది. మళ్లీ వీథిలోకి వెళ్ళి పక్కింటి పిన్నిగారిని పిలిచింది. "పిన్ని గారూ, రండి. . . అబ్బాయి ఊరేగింపు వస్తూంది."

అప్పటికే ఇళ్లల్లో జనం వీథిలోకి చేరారు, ఊరేగింపు తిలకించడానికని. మల్లెపూల తోరణాలతో పుష్పక విమానంలా కారు నెమ్మదిగా కదిలివస్తూంది. ఆ కారు వెనక, ముందు గాసులైట్లు నెత్తిన పెట్టుకొని కొందరు నడుస్తున్నారు. ముందు బాండువాళ్లు రకరకాల పాటలు వాయిస్తున్నారు. ఆ బాండు శబ్దంతోపాటు జానకమ్మ గుండెకూడ వేగంగా కొట్టుకొంటూంది ఆ ప్రమోదం భరించలేక. 'నా సీనుగాడు వచ్చేశాడు. ఎంత సిగ్గు పడుతున్నాడో తల వంచుకొని కూర్చున్నాడు' అనుకొంటూ లోనికి వెళ్ళి నీళ్లచెంబు తెచ్చింది. లోనికి వెళ్ళి తిరిగివచ్చేసరికి కారు వేగం కాస్త హెచ్చింది. అప్పటికే జానకమ్మ ఇల్లు దాటుకొంటూ ముందుకు సాగింది. ఆమె చేతిలోని చెంబు జారి కింద పడి ఎర్రని నీరూ, నల్లని బొగ్గులూ నేల పాలయాయి. 'పిచ్చినన్యాసి! సిగ్గుపడి వెళ్ళిపోయి ఉంటాడు. ఆ తల వంచుకున్న తీరే తెలుస్తుంది. తిరిగి వెళ్ళేటప్పుడు వస్తాడేమో? ఇప్పుడు ఇంత మంది చూస్తూ ఉండగా రావటానికి సిగ్గేసి ఉంటుంది. ఇలాంటి సమయంలో రాకపోవటమే మంచిది. కలెక్టరుగారి అల్లుడు చిన్న పూరిగుడిసెలోకి రావటం నా సీనుకి మంచిది కాదు. వాడి భార్య ఏమనుకొంటుంది? అసలే పెద్ద పెద్ద భవనాల్లో నివసించిన అమ్మాయి.' జానకమ్మ అలా అనుకొని తృప్తి పొందింది. కొబ్బరికాయ తీసి చెక్క పెట్టెలో దాచింది. పూలు తడిగుడ్డలో చుట్టిపెట్టింది. నులకమంచం పెరట్లో వేసుకొని పడుం వాల్చింది. ఏవేవో ఊహాలు ఆమె మనస్సులో కందిరీగల్లా రొద చేస్తున్నాయి. చెవులకు ఊరేగింపు బాండు శబ్దం ఇంకా వినవస్తూనే ఉంది.

'నా బాబు రేపు పొద్దున్నే తప్పక వస్తాడు. నన్ను చూడకుండా వెళ్ల లేడు' అనుకొంది.

ఆ రాత్రి ఎప్పుడు నిద్ర పట్టిందో జానకమ్మకు. వాస్తవికంగా చూడలేని సీనుపెళ్లి కలలో తనివితీరా చూడ గలిగింది. బాగా తెల్లరిపోయింది. ఇంకా కలలో పెళ్లి పూర్తి కాలేదు. బాలభాస్కరుని లేత కిరణాలు జానకమ్మ సొట్టలుపోయిన చెంపల్లో, లోతుకి పోయిన కళ్లలో దూరి గిలిగింతలు పెడుతున్నాయి. ఎవరో తలుపు దబదబా బాదేస్తున్నారు. జానకమ్మ కల చెదిరిపోయింది. తుళ్లిపడి లేచి చుట్టూ చూసింది, బారెడు పొద్దు పోయినా నిద్రపోయినందుకు. బాధ పడుతూ దుప్పటి దులిపి మడత పెట్టింది. మళ్లీ తలుపు తట్టిన శబ్దమైంది. జానకమ్మ ఆనందంతో లోనికి వెళ్లింది. 'నా బాబు వచ్చి ఉంటాడు. వెధవ మొద్దునిద్ర. పొద్దున్నే లేచి ఈపాటికి అన్నీ సిద్ధం చేసుకొని ఉండవలసింది' అనుకొంటూ డబ్బాలో కొబ్బరికాయ, గుడ్డలో పూలు మళ్లీ పళ్లెంలో అమర్చింది. 'నేనే వచ్చి ఉంటాడు. నే ననుకొన్నట్లే పొద్దున్నే వచ్చాడు. ఎంతయినా పెంచిన ప్రేమ' అనుకొంటూ తలుపు గడియ తీసింది, ఎగసిపడే హృదయాన్ని అదుపులో పెట్టుకుంటూ. తలుపు తెరవగానే శెట్టి బట్టలు చేతపుచ్చుకొని నిలబడి ఉన్నాడు. జానకమ్మ పవనాడులూ కుంగిపోయాయి. సంతోషమంతా నీరుగారిపోయింది.

"ఇదిగో, పంతులమ్మా, గుడ్డలు. పిల్లదాని గౌనులు రెండు, మా అడదాని రవికెలు రెండు. . . బాగా కుట్టి పెట్టాలి" అంటూ బట్టలమూట అందించాడు. జానకమ్మ మారు మాట్లాడక అవి అందుకొని లోనికి వెళ్లింది.

'పిచ్చినన్యాసి! చీకటి పడ్డాక ఎవరూ చూడకుండా వస్తాడు. అసలే అర్భకుడు. ఈ పెళ్లి హడావిడిలో బాగా అలిసి పోయి ఉంటాడు. సాయంత్రానికి తప్పక వస్తాడు' అనుకొంటూ వళ్లపాడి అరచేతిలో వేసుకొని, మాతి దగ్గరికి వెళ్లింది ఆశాజీవి జానకమ్మ.

అప్పటికే ఆ ఊరి పొలిమేరలు దాటిన రెండవ తరగతి రైలుపెట్టెలో, కొత్తభార్య పక్కన కూర్చొని, ఆమెను తన చూపులతో తడిపేస్తున్న సీను ఈ లోకాన్నే మరిచిపోయిన సంగతి పెంచిన ప్రేమ కేం తెలుస్తుంది? పాపం, పిచ్చి జానకమ్మ! ★

## చరిత్ర

మానవజాతి తప్పాల, నేరాల, దురదృష్టాల పట్టిక కంటె కొంచెం ఎక్కువ వివరాలు గలదే చరిత్ర.

—గిబ్బన్

## విజ్ఞానం

మానవుడు తన అజ్ఞానాన్ని తెలుసుకోగలిగినంత జ్ఞానం మాత్రమే సముపార్జిస్తాడు; తన తప్పిదాల్ని గ్రహించి పశ్చాత్తాపపడేటంతటి అనుభవం సంపాదిస్తాడు; అనంతరం చని పోతాడు.

—ప్లేటో